క్లుప్తంగా

లంబాడాలపై బీజేపీది సవతి తల్లిప్రేమ

లంబాడా సేన జిల్లా ఉపాధ్యక్షుడు రూప్లానాయక్

కేశంపేట: బీజేపీ లంబాడాలపైన సవతి తల్లి ప్రేమను చూపిస్తోందని లంబాడా సేన జిల్లా ఉపాధ్యక్షుడు రూప్లానాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. లంబాడాలు దొడ్డిదారిన ఎస్టీ జాబితాలోకి వచ్చారని ఎంపీ అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల ద్వారానే ఆయన పార్లమెంట్‌కు ఎన్నికయ్యారని గుర్తుచేశారు. అదే రాజ్యాంగం లంబాడాలకు రిజర్వేషన్లు కల్పించిన విషయం తెలియదాని ఎద్దేవా చేశారు. రాజ్యాంగాన్ని అవమాన పరిచేలా మాట్లాడిన ఎంపీ బాబురావును కేంద్ర ప్రభుత్వం పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

బీమాతో ప్రయోజనం

తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్ జుబేర్



శిబిరంలో పాల్గొన్న కాలనీవాసులు, తపాలాశాఖ సిబ్బంది

షాద్‌నగర్: తపాలాశాఖ అందిస్తున్న బీమా సదుపాయాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని షాద్‌నగర్ తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్ జుబేర్ కోరారు. శుక్రవారం బీమా నమోదు శిబిరాన్ని కౌన్సిలర్ మాధురి ప్రారంభించారు. ఈ సందర్భంగా జుబేర్ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని తపాలాశాఖ బీమా సదుపాయాన్ని కల్పిస్తుందన్నారు. ప్రమాద బీమాను రూ.396లకే రూ.10లక్షల పాలసీని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పాలసీని ప్రతి ఒక్కరూ తీసుకొని ధీమాగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు నందకిషోర్, ప్రభాకర్, జగన్, శ్రీనివాస్, ప్రసాద్, ప్రభు, శివాజీనాయక్, అంజనేయులు, నాగరాజు, రాజు, సుశీల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై ఆక్రమణల తొలగింపు



రోడ్లపై ఆక్రమణలు తొలగిస్తున్న పంచాయతీ పాలకవర్గం సభ్యులు

మొయినాబాద్: మండలంలోని సురంగల్‌లో అంతర్గత రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలను ఆక్రమించి నిర్మించిన ర్యాంపులు, మెట్లను పంచాయతీ పాలకవర్గం తొలగించింది. శుక్రవారం సురంగల్‌లో పంచాయతీ పాలకవర్గం పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించింది. అందులో భాగంగా అక్రమ నిర్మాణాలను తొలగించారు. ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మణిపూర్ ఘటన మాయని మచ్చ



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

శంకర్‌పల్లి: మణిపూర్ ఘటనలోని దోషులను కఠినంగా శిక్షించాలని మండల సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో సీపీఐ నాయకులు ర్యాలీ నిర్వహించి, మణిపూర్ ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. మణిపూర్ ముఖ్యమంత్రిని వెంటనే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ పాలనలో మైనార్టీలపై దాడులు పెరిగాయని అన్నారు. మణిపూర్ సంఘటన మాయని మచ్చ ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ చేవెళ్ల నియోజకవర్గం కన్వీనర్ రామస్వామి, మండల కార్యదర్శి సుధీర్, రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు ప్రభులింగం, కార్యదర్శి ఎండీ మోయినుద్దీన్, సత్తిరెడ్డి, శ్రీనివాస్, మహిళా సంఘం నేతలు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం

శంకర్‌పల్లి: మున్సిపల్ పరిధిలోని 10వ వార్డులోని డ్వాక్రా సంఘం భవనం పక్కనే ఉన్న ప్రభుత్వం స్థలాన్ని అక్రమార్కులు కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని సింగాపురం వార్డు ప్రజలు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ జ్ఞానేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 10వ వార్డులోని 1000గజాల స్థలంలో గతంలో గ్రామస్తులు పశువుల వ్యర్థాలు, పెంట కుప్పలు వేసుకొనే వారని తెలిపారు. సింగాపురం మున్సిపాలిటీలో విలీనం అయ్యాక మున్సిపల్ అధికారులు ఆ స్థలాన్ని ప్రభుత్వ స్థలంగా గుర్తించి బోర్డులను ఏర్పాటు చేశారు. ఇటీవల గుర్తు తెలియని వ్యక్తులు బోర్డును తొలగించారని తెలిపారు. ప్రభుత్వ స్థలంలో బోర్డులు ఏర్పాటు చేయడం, బోర్డులను తొలగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధుల ముప్పు

జోరుగా కురుస్తున్న వానలు
- విజృంభించనున్న వ్యాధులు
- ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహిస్తున్న అధికారులు



అంతర్గత రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

కొత్తూరు: ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు గ్రామాలు, పట్టణాల్లో ఇళ్ల మధ్య, ప్రధాన రోడ్లపై వర్షం నీరు నిల్వ ఉంటుంది. దీంతో దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలే ముప్పు పొంచి ఉందని వైద్యాధికారులు సూచిస్తున్నారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాగే, వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, ఇతర వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని వైద్య సిబ్బంది నివారణ చర్యలు ప్రారంభించారు.

అందుబాటులో వైద్య సిబ్బంది..

షాద్‌నగర్ నియోజకవర్గంలో పీహెచ్‌సీలు-06, యూపీహెచ్‌సీ-01, పీపీ యూనిట్-01, సీహెచ్‌సీ-01 ఉన్నాయి. అలాగే, ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు నియోజకవర్గంలో ఆశలు-288, ఏఎన్ఎంలు-28, స్టాఫ్‌నర్సులు-07, ల్యాబ్ టెక్నీషియన్లు-05, వైద్యులు-14మంది అందుబాటులో ఉన్నారు.

నీరు నిల్వ లేకుండా చూడాలి

డెంగ్యూ, మలేరియా వ్యాప్తికి నిల్వ ఉన్న నీటిలో వృద్ధి చెందే దోమలే ప్రధాన కారణంగా వైద్యులు చెబుతున్నారు. దీంతో గ్రామాల్లో ఎక్కువగా నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి నీటిని తొలగించడం లేని పక్షంలో అందులో మందులు చల్లుతున్నారు. ఇంట్లో ఉండే పూలకుండీలు, పాత రిఫ్రిజిరేటర్లు, టైర్లు, కూలర్లు, పాతగిన్నెల్లో నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండే అవకాశం ఉంది. దానికి తోడు రోడ్ల వెంట తాగి పడేసిన సీసాలు, గ్లాసులు, కొబ్బరిబొండల్లో సైతం విషజ్వరాలను తెచ్చే దోమలు పెరుగుతాయి. వీటిల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని వైద్య, పంచాయతీ, మున్సిపల్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

ప్రతి శుక్రవారం డ్రై డే...

సాధారణంగా వానాకాలంలో విషజ్వరాలు వ్యాప్తి చెందే అవకాశాలు ఎక్కువ. కావునా, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో జులై నుంచి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతి శుక్రవారం డ్రై డే పేరుతో పలు కార్యక్రమాలను చేపడుతున్నారు. నిల్వ ఉన్న నీటిని తొలగించడం పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. దానికి తోడు అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను సైతం చేపడుతున్నారు.



సీజనల్ వ్యాధులపై కేజీబీవీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జయలక్ష్మి

ప్రజల భాగస్వామ్యంతోనే వ్యాధుల నియంత్రణ



ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. వ్యాధులు వ్యాప్తి చెందకుండా వైద్యశాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా నీరు నిల్వ లేకుండా, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాదులకు దూరంగా ఉండవచ్చు.

– డాక్టర్ జయలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, షాద్‌నగర్

జీవకళ ఉట్టిపడేలా..

మొయినాబాద్‌రూరల్: చూడగానే నిజంగా గోవు నిలబడి దూడకు పాలిస్తుందేమో అనిపిస్తుంది.. కానీ, నిజానికి ఇది రాతితో చెక్కిన శిల్పం. హిమాయత్‌నగర్ సమీపంలోని హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి పక్కన ఓ హోటల్ ఎదుట రోడ్డు పక్కనే ఏర్పాటు చేశారు. చూపరులను ఆకట్టుకుంటుంది.



మొయినాబాద్‌రూరల్: ఆకట్టుకుంటున్న ఆవు దూడ శిల్పాలు

బురదమయం

మొయినాబాద్‌రూరల్: ఎడతెరపిలేని వర్షాలకు మండలంలోని ఎన్కెపల్లి చౌరస్తా సమీపంలోని హైదరాబాద్-బీజాపూర్ రహదారి బురదమయంగా మారింది. ప్రయాణికులు, ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతోనే రహదారులపై వర్షం నీరు నిలిచి ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు వాపోతున్నారు. వర్షం నీటిని తొలగించి రహదారిని శుభ్రం చేయాలని కోరుతున్నారు.



చిత్తడిగా మారిన రహదారి



ఎమ్మెల్యేను కలిసిన జర్నలిస్టులు

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

షాద్‌నగర్‌రూరల్: ప్రెస్ భవనాలకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కు జర్నలిస్టులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం షాద్‌నగర్ టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ప్రింట్ మీడియా అధ్యక్షుడు శ్రీశైలం ఆధ్వర్యంలో పలువురు జర్నలిస్టులు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ప్రెస్‌క్లబ్ భవనాల నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయించడం హర్షనీయమన్నారు. అలాగే, ఇళ్ల స్థలాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు.

దారి విడిచి ప్రహరీ నిర్మించండి

సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సభ్యుడికి వినతి



వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

షాద్‌నగర్: షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు రతన్ కాలనీలో రైల్వే క్వాటర్స్ వెనక ఉన్న ఇళ్లకు వెళ్లేందుకు దారి విడిచి రైల్వే అధికారులు ప్రహరీని నిర్మించాలని కాలనీవాసులు కోరారు. శుక్రవారం బీఆర్ఎస్ నేత యాదగిరియాదవ్ ఆధ్వర్యంలో కాలనీవాసులు సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సభ్యుడు డాక్టర్ చంద్రశేఖర్‌గౌడ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదగిరియాదవ్ మాట్లాడుతూ.. రైల్వే స్టేషన్‌కు సమీపంలోని రతన్‌కాలనీలో ఎన్నో ఏళ్ల క్రితం 40మంది నిరుపేద కుటుంబాలు ఇళ్లు నిర్మించుకున్నాయి. రైల్వే అధికారులు క్వాటర్స్ వెనక ప్రహరీ నిర్మిస్తే ఇళ్లకు వచ్చి వెళ్లేందుకు దారి ఉండదని తెలిపారు. ఆపద సమయంలో కనీసం అంబులెన్స్ వచ్చి వెళ్లేలా దారివదిలి ప్రహరీని నిర్మించాలని కోరారు. నిరుపేదల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రహరీ నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రాంచంద్రయ్య, సాయిబాబ, కుమార్, నర్సింలు, నజీర్, పాషా, హరిబాబు, విజయ, కమలమ్మ, సుశీల, సాలమ్మ, ఉమాపతిరావు, లక్ష్మణ్, శ్రీను తదితరులు ఉన్నారు.

పంటలను కాపాడుకోండి



పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

కొందుర్గు: అధిక వర్షాల నుంచి పంటలను కాపాడుకోవాలని మండల వ్యవసాయాధికారి మధుసూదన్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఉత్తరాసిపల్లిలో వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట పొలాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. మోతాదుకు మించి రసాయనిక ఎరువులు వాడొద్దని సూచించారు. నత్రజని పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ కృష్ణవేణి, రైతులు పాల్గొన్నారు.

బాధితులకు పరిహారం చెల్లించాలి

పీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్

షాద్‌నగర్‌రూరల్: వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులు, ఇల్లు కూలిన పేదలకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం షాద్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ నేతలు ఆర్డీఓ ఆఫీస్‌లోని ఏఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. భారీగా కురిసిన వర్షాలకు పత్తి పంట పూర్తిగా దెబ్బతినిందన్నారు. పంటలు దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెబుతున్నారు. అలాగే, చాలా గ్రామాల్లో ఇళ్లు కూలిపోవడంతో పేదలు నిరాశ్రయులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి బాధితులను గుర్తించి ఆదుకోవాలని కోరారు. అలాగే, చాలా గ్రామాల్లో వర్షాలకు రోడ్లు పూర్తిగా ధ్వంసమై రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌పార్టీ నిరుపేదలకు అండగా నిలుస్తుందని భరోసా కల్పించారు. అనంతరం వర్షాలకు ఇల్లు కూలిపోయిన బాధితులకు శంకర్ ఆర్థిక సహాయం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో నాయకులు బాబర్‌ఖాన్, బాల్‌రాజ్‌గౌడ్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, సుదర్శన్, రవికుమార్‌గుప్త, శ్రీనునాయక్, శేఖర్, శ్రీనివాస్, రవి, శ్రీకాంత్, నాగిసాయిలు, బాబునాయక్, కుమార్, దశరథ్, శేఖర్, శ్రీకాంత్, రఘుగౌడ్, సాయిగౌడ్, దేవేందర్ గౌడ్ ఉన్నారు.



కొందుర్గు: నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న శంకర్

బాధితులకు అండగా ఉంటాం

కొందుర్గు: అధిక వర్షాలకు ఇళ్లు కూలిపోయి ఇబ్బందులు పడుతున్న బాధితులను ఆదుకుంటామని ఎమ్మెల్యే కుమారుడు మురళియాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన కొందుర్గులో పర్యటించి ఇల్లు కూలిన బాధితులకు ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. ప్రపంచాన్నే కుదిపేసిన కరోనా సమయంలోనే ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నామని గుర్తు చేశారు. ప్రస్తుతం బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, వివిధ గ్రామాల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



షాద్‌నగర్: బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న బీజేపీ నేతలు

నిత్యావసర సరుకుల పంపిణీ

కొందుర్గు: వర్షాలకు ఇల్లు కూలిన బాధిత కుటుంబాలను ఆదుకుంటామని పీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్ అన్నారు. శుక్రవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఎదిరలో పర్యటించి బాధితులకు ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అదిష్టానం పిలుపుమేరకు బాధితులకు సహాయం అందిస్తున్నామని, కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడుతోందని పేర్కొన్నారు. ఇళ్లు కూలి బాధితులు బిక్కుబిక్కుమంటున్న అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కావలి రాజు, గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

చేవెళ్ల: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కూలిన ఇళ్లను కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. శుక్రవారం చేవెళ్ల మండలంలోని దామరగిద్ద, తంగడపల్లి గ్రామాల్లో వర్షాలకు కూలిన నాలుగు ఇళ్లను కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గం నాయకుడు సున్నపు వసంతం పరిశీలించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి ఆర్థిక సహాయం అందజేశారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీ రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

షాద్‌నగర్: వర్షాలకు ఇల్లు కూలిపోయిన నిరుపేద కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ నేత, పాలమూరు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని గంట్లవెల్లి, పోమాలపల్లి తదితర గ్రామాల్లో వర్షానికి కూలిపోయిన ఇండ్లను బీజేపీ నేతలు పరిశీలించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ... ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు మట్టి ఇల్లు కూలిపోయాయని అన్నారు. వారికి బీజేపీ అండగా నిలుస్తుందని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో నాయకులు అందెబాబయ్య, మోహన్‌సింగ్, నర్సింహ్మ యాదవ్, ఆకుల ప్రదీప్, లష్కర్‌నాయక్, అశోక్, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమాజ సేవలో విద్యార్థులు పాలుపంచుకోవాలి

ప్రొఫెసర్ డాక్టర్ విలియం

మొయినాబాద్‌రూరల్: సమాజ సేవలో విద్యార్థులు పాలుపంచుకోవాలని ఈపీఐసీఎస్ పార్డ్యూ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ విలియం కోరారు. మండలంలోని అజీజ్‌నగర్ సమీపంలోని కె.ఎల్. యూనివర్సిటీలో వారం రోజులుగా ఇంజనీరింగ్ ప్రాజెక్ట్స్ ఇన్ కమ్యూనిటీ సర్వీస్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. శుక్రవారం ముగింపు కార్యక్రమాన్ని ఛాన్సలర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రొఫెసర్ విలియం మాట్లాడుతూ.. దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో ఒకటైన కె.ఎల్. యూనివర్సిటీ క్యాంపస్ అభివృద్ధిలో ముందుకు వెళ్తుందన్నారు. వర్క్‌షాప్‌లో పలు కళాశాలల నుంచి 340 మంది విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమన్నారు. విద్యకే పరిమితం కాకుండా విద్యార్థులు ఫీల్డ్ సర్వేలు నిర్వహించినప్పుడే కొత్త కొత్త ఆలోచనలతో అవగాహన పెంపొందుతుందని సూచించారు. కార్యక్రమంలో కె.ఎల్.యూనివర్సిటీ ఛాన్సలర్ కోనేరు సత్యనారాయణ, ఏపీఐసీఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ సైదిరెడ్డి, ప్రిన్సిపాల్ రామకృష్ణ ఎస్.కిషోర్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.


రైతులకు నాణ్యమైన ఎరువులు అందిస్తాం

సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్

షాబాద్: రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు పంపిణీ చేస్తామని సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ గొల్లపెల్లి రత్నాకర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ముద్దెంగూడలో సేవాస్ఫూర్తి ఫౌండేషన్ సహకారంతో ఫెర్టిలైజర్ షాప్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ, జాతీయ పరిశోధన సంస్థల భాగస్వామ్యంతో చేస్తున్న కార్యక్రమాలను రైతులకు వివరించారు. రైతులకు సూచనలు, సలహాలు అందిస్తూ అధిక దిగుబడులు సాధించేందుకు ఈ సంస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నాణ్యమైన ఎరువుల కోసం సుగుణమాల రైతు ఉత్పత్తిదారులు ఫెర్టిలైజర్ షాప్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సంఘం మండలంలోని పలు గ్రామాలకు చెందిన 90 మంది రైతులు సభ్యులుగా ఉన్నారని చెప్పారు. ఏఓ వెంకటేశం మాట్లాడుతూ.. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే ముందు నాణ్యత పరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ జయమ్మ, ఉపసర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, రైతు సంఘం డైరెక్టర్లు లింగం, గోపాల్‌రెడ్డి, యాదవరెడ్డి, మల్లారెడ్డి, అంజయ్య, మాజీ ఎంపీపీ వెంకటయ్య, రైతులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులను విస్మరించడం సరికాదు

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్



షాద్‌నగర్: ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న కార్మికులు

షాద్‌నగర్: జీపీ కార్మికులకు ప్రభుత్వం కనీస వేతనాలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్ కోరారు. శుక్రవారం పట్టణంలో కార్మికులు ప్లకార్డులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనునాయక్ మాట్లాడుతూ.. పల్లెలను పరిశుభ్రంగా ఉంచుతూ.. అభివృద్ధికి పాటుపడుతున్న కార్మికులను ప్రభుత్వం విస్మరించడం సరికాదన్నారు. చాలీచాలని వేతనాలతో కార్మికులు దుర్భరమైన జీవితాలు అనుభవిస్తున్నారని వాపోయారు. కార్మికులకు నెలకు కనీసం రూ.26వేల వేతనం ఇవ్వాలని, విధి నిర్వహణలో కార్మికులు చనిపోతే వారికి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో కార్మికులు జంగయ్య, యాదయ్య, అంజయ్య, మల్లయ్య, కృష్ణయ్య, చంద్రమ్మ, ప్రమీల, జంగయ్య, సురేష్, పద్మమ్మ, బాలమణి, రామస్వామి, నర్సింహ్మా, జంగమ్మ, నర్సమ్మ పాల్గొన్నారు.

కార్మికులపై నిర్లక్ష్య వైఖరి తగదు

మొయినాబాద్‌రూరల్: పంచాయతీ కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించదాని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ పేర్కొన్నారు. శుక్రవారం పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెలో ఆయన పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె కొనసాగుతోందని అన్నారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా జీపీ అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద వర్షాన్ని సైతం లెక్క చేయకుండా సమ్మె చేశారని తెలిపారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల మండల అధ్యక్షుడు అంజనేయులు, నాయకులు సుధాకర్, కృష్ణ, ప్రేమిళ, భారతమ్మ, వెంకటేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె

కేశంపేట: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కారించాలని జీపీ కార్మికులు శుక్రవారం నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 20వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం కార్మికుల పట్ల సానుకూలంగా స్పందించాలని కోరారు. పనికి తగిన వేతనంతో పాటు 010 కింద జీతాలను చెల్లించాలని, అర్హులైన వారికి జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాంచంద్రయ్య, రవి, జంగయ్య, రవికుమార్, రోశయ్య, పద్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.